# 14

# సంఘము యొక్క దైవికమైన పేర్లు

సంఘము అవయవములుగల ప్రత్యేకమైన సంఘటిత శరీరంగా సృజింపబడినట్టు క్రొత్త నిబంధనను జాగరూకతతో చదివినయెడల తెలియజేస్తుంది. అందువలన, అది ప్రత్యేకమైన విధాలుగా దైవ ప్రేరేపితులైన లేఖకులచేత అది సూచింపబడింది. ఈ రిఫరెన్సులను మూడు గుంపులుగా విభాగింపవచ్చును. స్పష్టముగా ఉద్దేశింపబడిన పనిలోను, సొంతగానితోను, బాంధవ్యాలతోను అవి ప్రత్యేకమైన అర్థంతో ఉపయోగించ బడ్డాయి. అవి దైవికమైన డైరక్షన్‌చే దైవికమైన ఉద్దేశం నెరవేర్చ బడడానికి యివ్వబడ్డాయి.

సంఘాన్ని సూచించడానికి పరిశుద్ధాత్మ ఉపయోగించిన పద ప్రయోగాలు కేవలం ఉదాహరణలుగా భావించ కూడదు.[1] క్రీస్తును నమ్మకంగా వెంటాడేవారిని "ఆయన సంఘము" ఆయన "శరీరము", మరియు "ఆయన రాజ్యము" అని క్రొత్త నిబంధన పిలుస్తుంది. ఈ దైవికమైన ఈ పేర్లు[2] ప్రభువు స్థాపించిన సంఘాన్ని గుర్తిస్తాయి, గుణ లక్షణాలను తెలుపుతాయి, వర్ణిస్తాయి. వాటిని జాగ్రత్తగా ఆలోచనచేయి.

## కర్తవ్యాన్ని సూచించే పేర్లు

క్రొత్త నిబంధనలో సంఘమునకు యివ్వబడిన కొన్ని పేర్లు సంఘము శరీరముగా, సజీవంగా జరిగించే కర్తవ్యానికి సంబంధించియున్నాయి. ఉద్దేశంలోను, నమూనా లోను, కార్యములోను ప్రభువు సంఘము ఏమైయుందో అవి సంక్షిప్తంగా చూపుతాయి.

క్రీస్తు స్థాపించింది కేవలం సంఘమని సూచింపబడింది (కొలస్సీ. 1:18, 24). "ప్రభువు యొక్క అనుచరులుగా కూడిన ప్రజలు" అని ఈ ప్రయోగమునకు భావం.

ప్రజలు కూడుకొనిన భావంతో (1 కొరింథీ. 11:18), స్థానిక భావముతో (1 కొరింథీ. 1:2), ప్రాంతీయ భావముతో (1 కొరింథీ. 16:1), సార్వత్రికమైన భావంతో (ఎఫెసీ. 5:23) జనులు సూచింపబడ్డారు. క్రీస్తు స్థాపించునది ఏదో అనే ప్రాథమిక అర్థాన్ని ఈ పేరు ప్రకటిస్తుంది. ఆయన రక్తముచే విమోచింపబడి, ఆయన కొరకు జీవించుతూ, ఆయనను సేవించుతూ, ఆయన కొరకు పనిచేసే జనుల గుంపు.

వారు క్రీస్తువలె ఉండుటకు ప్రయత్నించువారు గనుక, వ్యక్తిగతమైన సభ్యులు "క్రైస్తవులని" పిలువబడతారు. క్రైస్తవుడనే పదానికి "క్రీస్తువంటి" లేక "క్రీస్తు అనుచరుడు" అని భావం. మొట్టమొదట, అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడ్డారు (అపొ. 11:26). ఈ పేరు పెట్టబడిన పరిస్థితులు అంత స్పష్టంగా లేవు, కాని దీనిని దేవుడు తన ప్రజలకొరకు ఏర్పరచుకొన్నాడన్న సంగతి నిశ్చయము. పేరుగా యిది క్రొత్త నిబంధనలో మూడు సార్లు కన్పిస్తుంది (అపొ. 11:26; 26:28; 1 పేతురు 4:16).

సంఘ సభ్యులను బైబిలు "పరిశుద్ధులు" అని సూచిస్తుంది; వారు పరిశుద్ధపరచ బడినవారు. దేవునిచే ఏర్పరచబడినవారుగా వారు ప్రత్యేకింపబడియున్నారు. పౌలు ఎఫెసీయులను ఇలా సంబోధించాడు: "దేవుని చిత్తమువలన క్రీస్తుయేసు అపొస్తలుడైన పౌలు ఎఫెసులోనున్న పరిశుద్ధులును క్రీస్తుయేసునందు విశ్వాసులునైన వారికి శుభమని చెప్పి వ్రాయునది" (ఎఫెసీ. 1:1). KJV బైబిల్లో తీతు 2:14నందు "వింతైన జనము" అని ఉంది. ఈ పుస్తకం వెనుకనున్న క్రొత్త నిబంధన, "తన సొత్తయిన ప్రజలు" అని చెప్పుతోంది. "పరిశుద్ధుడు" అనే పదానికి ప్రాథమిక అర్థం దేవుని కొరకు ప్రత్యేకపరచుకొన్నవాడు అని భావం. దేవుని సంఘము అనేది, "దేవుని సొత్తయిన ప్రజలు" పరిశుద్ధ జనం, దేవుని కొరకు ప్రత్యేకపరచుకొన్న ప్రజలు. క్రైస్తవులు పరిశుద్ధమైన పిలుపుతో పిలువబడినవారు (2 తిమోతి 1:9); వారు పరిశుద్ధ ప్రవర్తనయు, భక్తియు గలవారై జీవించాలి (2 పేతురు 3:11); వారు చివరి దినమున ఆయన ఎదుట, "పరిశుద్ధులుగాను, నిర్దోషులుగాను, నిష్కళంకులుగాను" ప్రత్యక్షమగుటకు వెదకువారు (కొలస్సీ. 1:22బి).

కొన్ని బైబిలు తర్జుమాలలో మత్తయి, మార్కు, లూకా, యోహాను, అనే సువార్త రచనల పేర్లకు "పరిశుద్ధుడు" (saint) అనే పదం తగిలించబడింది, మరియు "ప్రకటన"కు– "ది రెవలేషన్ ఆఫ్ సెయింట్ జాన్ ది డివైన్" అని పేరు పెట్టబడింది. క్రొత్త నిబంధనకు ఈ పేర్లు మనుష్యుల వద్దనుండి వచ్చినవే గాని దేవునినుండి కాదు సుమీ. క్రొత్త నిబంధన, క్రీస్తులో ఉన్న ప్రతి ఒక్కనిని "పరిశుద్ధుడని" చెప్పుతుంది. సంఘము సహితము

"పరిశుద్ధుల సంఘములు" అని (స్థానిక భావముతో) సూచింపబడింది (1 కొరింథీ. 14:33). క్రైస్తవులైనప్పుడు జనులు దేవుని కొరకు ప్రత్యేకపరచబడ్డారు.

దీనికి తోడు, సంఘము క్రీస్తు "శరీరము"గా సూచింపబడింది (ఎఫెసీ. 1:22, 23). కర్తవ్యంలో సంఘము ఏమైయుందో సూచించడానికి ఈ పదం ఉపయోగించ బడింది (1 కొరింథీ. 12:12-27). మరి కొన్ని సార్లు, గుర్తింపుయొక్క పదంగా సంఘం ఏమైయుందో అది సూచిస్తుంది. "క్రీస్తు శరీరం" అనే ప్రయోగం పేరుగా ఉపయోగింపబడినప్పుడు, సంఘము యొక్క కర్తవ్యము, దాని బాంధవ్యము నొక్కి చెప్పబడ్డాయి: సంఘము భూమిమీద క్రీస్తుయొక్క ఆత్మసంబంధమైన శరీరమై యున్నది, శరీరము శిరస్సునకువలె అది క్రీస్తుతో సంబంధం కలిగియుంది. క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన ఈ శరీరమందు, ఒక్కొక్క క్రైస్తవుడు శరీరము యొక్క "అవయవములుగా" కర్తవ్యాన్ని నెరవేర్చవలసినవారై, శరీరములోని అవయవములు పని చేసినట్టు ప్రతి క్రైస్తవుడును దానిలో అవయవమైనట్టు పని చేస్తూ ఉండాలి. పౌలు కొరింథీయులకు వ్రాసినప్పుడు, "అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" అని అన్నాడు (1 కొరింథీ. 12:27).

సంఘము "రాజ్యమని" కూడా సూచింపబడింది (అపొ. 8:12). కొన్నిసార్లయితే, "పరలోకరాజ్యము" అని వ్యక్తపరచబడింది (మత్తయి 16:18, 19), మరికొన్ని సార్లు అది "దేవుని రాజ్యము" అని కూడా సూచింపబడింది (యోహాను 3:3). ఈ రెండు ప్రయోగాలు కూడా సంఘ/రాజ్యము యొక్క ఆత్మసంబంధమైన అధికారము, ఏలుబడి యొక్క స్వభావాలను ప్రతిఫలింపజేస్తున్నాయి (యోహాను 18:36). సంఘము -దేవుని యొక్క ఏలుబడికి తమ్మును తాము లోబరచుకొని క్రీస్తు ప్రభువుని వెంబడించే జనమై యున్నారు. క్రీస్తు నేడు రాజైయుండి, సంఘమనే తన రాజ్యాన్ని ఏలుతున్నాడు (1 కొరింథీ. 15:24, 25). తత్ ఫలితంగా, సంఘానికి దైవికమైన శిరస్సు లేక రాజు ఉన్నాడు, మరియు అది దైవికమైన అధికారంతో పరిపాలన చేయబడుతుంది. సంఘ సభ్యులు యేసు రాజు యొక్క అధికారానికి లోబడినవారై, ఆయన ఆత్మసంబంధమైన రాజ్యమునకు పౌరులైయున్నారు (ఫిలిప్పీ. 3:20).

అలాగుననే, దేవుని రాజ్యములో భాగమైయున్నవారు పరలోక రాజ్యపు "పౌరులుగా" వర్ణింపబడ్డారు (మత్తయి 16:18, 19). పౌలు యిలా అన్నాడు, "మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసు క్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము" (ఫిలిప్పీ. 3:20). "కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై

యున్నారు. క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు" అని కూడా పౌలు తెలిపాడు (ఎఫెసీ. 2:19, 20), క్రీస్తు మనకు రాజైయున్నాడు (1 కొరింథీ. 15:24, 25), మరియు క్రీస్తుయొక్క ఏలుబడి క్రింద జీవించేవారే ఆయన రాజ్యమైయున్నారు (మత్తయి 7:21).

పాత నిబంధనలో దానియేలు ప్రవచించిన నిత్యరాజ్యము యొక్క పౌరులు క్రైస్తవులే (దానియేలు 2:44). దానిని హెబ్రీ రచయిత "నిశ్చలమైన" రాజ్యమని వర్ణించాడు: "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవ కృప కలిగియుందుము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము ..." (హెబ్రీ. 12:28). ఈసారి, నేటినుండి వెయ్యి సంవత్సరాల తరువాత ఎక్కడ ఉండబోతావో నిన్ను నీవు ప్రశ్నించుకో, నీవు క్రైస్తవుడవై ఉన్నట్టయితే, "నేను దేవుని నిత్యరాజ్యములో ఉంటాను!" అని నీకు నీవే చెప్పుకోగలవు. దేవుని రాజ్యము నేడు యిక్కడ ఉండి రేపు వెళ్లిపోయేది కాదు – అది నిత్యరాజ్యం.

## సొంతదారునికి సంబంధించిన పేర్లు

దేవునికిని ఆయన క్రీస్తుకును సంఘము సొంతమైయున్న తీరులో క్రొత్త నిబంధనయందు సంఘము మూడు విధాలుగా సూచింపబడింది. ఈ ప్రయోగాలు సొంతదారీ తనాన్ని, నాయకత్వాన్ని సూచిస్తాయి.

మొదటిగా, సంఘము "క్రీస్తు సంఘ"మని సూచింపబడింది. రోమీయులకు పౌలు పత్రికయొక్క ముగింపులో, అకయలోని స్థానిక సంఘాలకు వందనాలు పంపుతూ, "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" అని అన్నాడు (రోమా 16:16బి). ఈ పేరు సంఘము యొక్క అభేదాన్ని – సొంతదారీ తనాన్ని నొక్కి పలుకుతుంది. సంఘము క్రీస్తు సంఘమే – ఎందుకంటే, క్రీస్తు దీన్ని స్థాపించాడు, కొన్నాడు, సొంతగాడైయున్నాడు, దానికి శిరస్సుగా పని కలిగియున్నాడు. ఒకడు క్రీస్తులోనికి మార్పు చెందినప్పుడు, అతడు క్రీస్తునకు చెందినవాడై ఉంటాడు (1 కొరింథీ. 6:20). అతడు క్రీస్తులో ఎంతగా అభేదాన్ని పొందుతాడంటే, అతడు క్రీస్తుకు చెందినవాడైయుంటాడు. అతడు క్రీస్తులో ఎంతగా అభేదాన్ని పొందుతాడంటే అతడు క్రైస్తవుడని, క్రీస్తును వెంటాడువాడని పిలువబడతాడు (అపో. 11:26; 26:28; 1 పేతురు 4:16). సంఘము ఎవరైయున్నది, దానికి సొంతదారీ ఎవరైనది, ఎవరు

దానిలో భాగమైయున్నది సూచించడానికి గాను క్రీస్తును వెంబడించేవారి ప్రత్యేకమైన కూడిక క్రీస్తు సంఘమని పిలువబడుతుంది.

రెండవదిగా, సంఘము "దేవుని సంఘమని" చెప్పబడింది (1 కొరింథీ. 1:2). క్రొత్త నిబంధనలో సంఘము క్రీస్తు సంఘమని చెప్పబడినట్లయితే, దానిని దేవుని సంఘమని కూడా సూచింపబడేలా మనం ఎదురు చూడబడతాం, ఎందుకంటే ఆయనలో తండ్రియు ఏకమైయున్నట్టు ప్రభువు అన్నాడు (యోహాను 10:30). అసలు జగత్తు పునాది వేయబడక మునుపే దేవుడు సంఘాన్ని సంకల్పించాడు (ఎఫెసీ. 3:10, 11). ఆ సంఘం కొరకు సిద్ధపాటు జరిగించడానికిని (మత్తయి 16:18), తన స్వరక్తంతో దాన్ని కొనడానికిని దేవుడు క్రీస్తును లోకానికి పంపించాడు (అపొ. 20:28). సిలువ యొద్ద దేవుడు క్రీస్తునందు లోకాన్ని తనతో సమాధానపరచుకొన జూచినట్టే (2 కొరింథీ. 5:19), క్రీస్తు తన సంఘాన్ని స్థాపించడంలోను, దానిని కొనడంలోను దేవుడు క్రీస్తుతో కూడ ఉన్నాడు.

మూడవదిగా, సంఘము యొక్క సభ్యులు "బానిసలు" లేక "దాసులుగా" వర్ణించబడ్డారు. క్రీస్తుకు తమ్మును తాము లోబరచుకొని ఆయనకు విధేయులైన వారు ఆయన దాసులైయుంటారు. క్రొత్త నిబంధన వ్రాయబడిన దినాల్లో, బానిస/ యజమాని బాంధవ్యం రోమా సామ్రాజ్యపు సమాజంలో ఒక భాగంగా ఉండేది. బానిస సంపూర్ణంగా తన యజమానియొక్క స్వాధీనంలో ఉండేవాడు. వానికి ఏ హక్కుగాని, నిజమైన సొత్తుగాని ఉండేది కాదు. కడకు అతడు కూడా తన సొత్తు కాదు. మనం క్రీస్తుకు సంపూర్ణంగా సమర్పించుకొనడం, మరియు మన జీవితం ఆయన వాక్యానికి లోబడి యుండడం అనే ఈ బాంధవ్యాన్ని ఉదహరించడానికి ఆ పదం ఉపయోగించడంలో ఆశ్చర్యపడ నవసరం లేదు. "... నేనిప్పటికిని మనుష్యులను సంతోష పెట్టువాడనైతే క్రీస్తుదాసుడను కాకయేపోవుదును" అని పౌలన్నాడు (గలతీ. 1:10బి; ఫిలిప్పీ. 1:1 కూడా చూడు). పైగా అతడు యిలా అన్నాడు, "మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి మీరు సంపూర్ణ విధేయతను కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతిదండనచేయ సిద్ధపడి యున్నాము" (2 కొరింథీ. 10:5).

క్రైస్తవులు – క్రీస్తు తమ యజమానుడని చెప్పుకొనేవారు – తమ సొంత జీవితాలపై యిక ఏమాత్రము యజమానులై యుండనేరరు. తమ సొంత యిష్టాన్ని "సిలువ" వేయవలసినవారైయున్నారు. అంటే, వారు తమ పాపపు మానవ కోర్కెలను నాశనపరచి దేవుని ఆజ్ఞలను తమ జీవితాల్లో ప్రథమంగా ఉంచుకోవాలి. పౌలు యిలా అన్నాడు,

"అయితే మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక; దానివలన నాకు లోకమును లోకమునకు నేనును సిలువవేయబడియున్నాము" (గలతీ. 6:14). ఇంకా అతడిలా అన్నాడు, "నేను యేసుయొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను, ఇకమీదట ఎవడును నన్ను శ్రమపెట్టవద్దు" (గలతీ. 6:17).

## బాంధవ్యానికి సంబంధించిన పేర్లు

క్రొత్త నిబంధన సంఘాన్ని సూచించే పలు విధానాల్లో బాంధవ్యమనే భావాన్ని అది నొక్కి పలుకుతుంది. ప్రభువు సంఘంలో సభ్యుడవయ్యుండడాన్ని బట్టి పలు విధములైన బాంధవ్యాలు కలిగియుండడం ఎదురు చూసే విషయమే.

ముందుగానే ప్రస్తావించబడిన దాసుడు, యజమానుడు, శరీరము, శిరస్సు అనే బాంధవ్యాలతో పాటు, ప్రభువుతో సంఘ సభ్యులకుండే బాంధవ్యం "క్రైస్తవుడు" అనే రమ్యమైన పదముతో వ్యక్తపరచబడింది. వారు ఆయన అనుచరులు; వారు ఆయన కొరకు జీవిస్తారు, ఆయన నామాన్ని ధరించుకొంటారు. క్రైస్తవుడయిన పిమ్మట మత సంబంధమైన తన జీవితాన్ని అపొస్తలుడైన పౌలు వన్నెకెక్కిన తన మాటలలో యిలా అన్నాడు: "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" (ఫిలిప్పీ. 1:21). క్రీస్తు తన జీవితంలో ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకొనడమే కాదు - క్రీస్తే పౌలుకు జీవితమైయున్నాడు! పౌలు జీవితంయొక్క సంపూర్ణత విశేషము క్రీస్తే. అతడు నిజముగా క్రైస్తవుడై యున్నాడు.

క్రొత్త నిబంధన సంఘమును "దేవుని కుటుంబ"మని కూడా వర్ణిస్తుంది. క్రైస్తవులు "దేవుని యింటివారై" యున్నట్టు పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 2:19). "దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో" తాను ఎలా జీవించాలో ఎరుగునట్లు తిమోతికి పౌలు వివరించాడు (1 తిమోతి 3:15). ఒకడు క్రీస్తులోనికి మార్పు చెందినప్పుడు, దేవుడతని తన కుమారునిగా స్వీకరించి, కుటుంబ సంబంధమైన ఆధిక్యతలను అనుగ్రహించి, క్రీస్తుతో కూడ నిత్యజీవమునకు వానిని వారసునిగా నియమిస్తాడు (రోమా 8:15-17; ఎఫెసీ. 1:5). ప్రార్థించడానికి క్రైస్తవునికి పరలోకపు తండ్రి ఉన్నాడు, మరియు తనను ప్రేమించిన రక్షకుడు-ఎవరి ద్వారా మనము ప్రార్థించాలో ఆ జ్యేష్ఠుడైన యేసు క్రీస్తు అను అన్నయ్య కూడా ఉన్నాడు. అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రుగా వారు ఒకరినొకరు బలపరచుకొంటూ, ప్రేమతో సహాయం చేసికొంటూ

ఉంటారు (అపొ. 2:44).

సంఘ సభ్యులు దేవుని కుమారులుగా పోల్చబడ్డారు, వారికి దేవునితో ప్రత్యేకమైన బాంధవ్యముంది ఆయన వారికి తండ్రి; వారు దేవుని కుమారులై యున్నారు. విశ్వాసులు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు, దేవుని "కుమారులు"గా వారు స్వీకరింపబడ్డారు (ఎఫెసీ. 1:5). తన కుమారులుగా, క్రైస్తవులు నిత్య స్వాస్థ్యము కలిగినవారై యున్నారు (ఎఫెసీ. 1:11), భూమిమీదనున్న దేవుని కుటుంబము వారికి బలముగాను ఆధారంగాను ఉంటుంది (1 తిమోతి 3:15; ఎఫెసీ. 2:19-22). ఈ ఆత్మ సంబంధమైన పరలోక సంబంధమైన కుటుంబములో దేవుడు తండ్రియై యున్నాడు (మత్తయి 6:9), క్రీస్తు ప్రభువు పెద్ద అన్నయైయున్నాడు (రోమా 8:17); మరియు క్రైస్తవులందరు - అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రునైయున్నారు (2 పేతురు 3:15; 1 యోహాను 2:8-11).

తన పిల్లల పట్ల దేవునికి ప్రత్యేకమైన ప్రేమ ఉన్నది (1 యోహాను 3:1). అపవాది నుండి వారిని కాపాడి, వారి దైనిక అవసరతలకు కావలసిన వాటిని ఆయన వారికి దయచేస్తాడు. భూ సంబంధమైన తండ్రియే తన పిల్లలకు శ్రేష్ఠమైన వాటిని అనుగ్రహించువాడైనట్లయితే, సర్వశక్తుడగు దేవుని పిల్లలు - పరలోకమందున్న పరిపూర్ణుడగు తండ్రి - తన్ను అడుగువారికి మరి శ్రేష్ఠమైన వాటిని ప్రసాదించును గదా! (మత్తయి 7:11 చూడు).

ఆది సంఘములోని సభ్యులు ఒకరినొకరు సహోదరులుగా మాత్రమే గాక, స్నేహితులుగా కూడా భావించుకొన్నారు (2 పేతురు 3:15; 3 యోహాను 14బి). వారు స్నేహ బాంధవ్యంలో రమ్యంగా నిలిచియుండేవారు. క్రైస్తవులు అతి శ్రేష్ఠమైన స్నేహితులై యున్నారు.

తన మూడవ పత్రికను వ్రాస్తూ, యోహాను యిలా ముగించాడు, "నీకు సమాధానము కలుగును గాక. మన స్నేహితులు నీకు వందనములు చెప్పుచున్నారు. నీ యొద్దనున్న స్నేహితులకు పేరుపేరు వరుసను వందనములు చెప్పుము" (3 యోహాను 14బి). తన చుట్టునున్న క్రైస్తవులను "స్నేహితులని" అతడు అన్నాడు, మరియు తన ఉత్తరం పొందే క్రైస్తవులను కూడా స్నేహితులనే అతడు పిలిచాడు. తన శిష్యులను "స్నేహితులని" ప్రభువే పిలిచాడు, ప్రభువు యొక్క మాదిరి చొప్పున యోహాను ఈ పదాన్ని ప్రయోగించాడనడం నిస్సందేహం. ప్రభువైన యేసు తన శిష్యులతో యిలా అన్నాడు,

తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు. నేను మీ కాజ్ఞాపించువాటిని చేసినయెడల, మీరు నా స్నేహితులై యుందురు. దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను, ఎందుకనగా నేను నా తండ్రివలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని (యోహాను 15:13-15).

"ప్రతి ఒక్కడు నిన్ను విడిచినప్పుడు నీతో ఉండువాడే స్నేహితుడని" ఒక వ్యక్తి అన్నాడు. ప్రభువైన యేసు ఈ రకమైన స్నేహితుడు. మనకు ఎవడును సహాయపడ లేనప్పుడు, ఆయన మన కొరకు తన ప్రాణమును పెట్టియున్నాడు. క్రైస్తవులు ఒకనికొకడు ఈలాటి స్నేహితులై యుండాలి (1 యోహాను 3:16). క్రైస్తవులు "స్నేహితులు."

తరచుగా మొదటి శతాబ్దపు సంఘము "ప్రభువు యొక్క శిష్యులు" అని సూచింప బడ్డారు (అపొ. 9:1) లేక కేవలం "శిష్యులు" అని పిలువబడ్డారు (అపొ. 9:26; 11:26). శిష్యుడు అనే మాటకు "నేర్చుకొనువాడు లేక వెంబడించువాడు" అని అర్థం; క్రైస్తవునికిని ప్రభువుకును కొనసాగుచు ఉండే బాంధవ్యాన్ని అది తెలుపుతుంది. తనకంటె మిన్నయైనవానికి తన్ను తాను అప్పగించుకొనేవాడు, మరియు బోధద్వారాను అనుకరణ ద్వారాను నేర్చుకొనడానికి ఎల్లప్పుడు వెదకువాడు శిష్యుడు. అతడు కేవలం వినువాడు మాత్రమే కాదు; నేర్చుకొనువాడు, శిష్యుడు. తన ప్రభువే అతనికి యజమాని, గురువు (యోహాను 13:13).

"శిష్యుడు" అనే పదం ప్రత్యేకంగా సువార్త రచనలలో ఉపయోగించబడి, వాటిల్లో 238 సార్లు కన్పిస్తుంది. అపొస్తలుల కార్యాలలో అది 28 సార్లు కనిపిస్తుంది, అయితే అది పత్రికలలో గాని ప్రకటనలో గాని కన్పించదు. సువార్త రచనలలోనుండి అపొస్తలుల కార్యాలకు అక్కడనుండి పత్రికలకు వెళ్లడంలో – ఈ పద ప్రయోగం మారియుండవచ్చు. అయితే భూమిమీద క్రీస్తు ప్రభువు యొక్క జీవిత కాలంలో, తనకు సంబంధించి ఆయనను వెంబడించేవారు ఆయన శిష్యులుగా సూచింపబడినట్టున్నారు. అటు పిమ్మట, అపొస్తలుల కార్యాలలోను, పత్రికలు, ప్రకటనలోను వారు "పరిశుద్ధులని" తమ పిలుపును బట్టియు, ఒకరికొకరికి ఉండవలసిన బాంధవ్యాన్నిబట్టి వారు "సహోదరులని"యు పిలువబడ్డారు.

తన ఆరోహణానికి ముందు తన అపొస్తలులకు గొప్ప ఆజ్ఞను (Great Commission) యిస్తూ క్రీస్తు యిలా ఆజ్ఞాపించారు, "కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో

వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19, 20). ఈ విధంగా, "శిష్యుడు" అనే పద ప్రయోగం కొనసాగింపబడేలా, క్రొత్త నిబంధన యొక్క తరువాత భాగంలో అది కన్పించక పోయినా, ఆయన యిచ్చినట్టున్నాడు.

శిష్యుడు వాక్య ప్రకారం ప్రవర్తించువాడు. "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" అని యాకోబు అన్నాడు (యాకోబు 1:22). శిష్యుడు విద్యార్థికంటె మించినవాడు; అతడు క్రీస్తును అనుకరించువాడు, క్రీస్తును వెంబడించువాడు.

మరొక కోణంలో, క్రొత్త నిబంధన సంఘము "దేవుని ఆలయమని" పిలువబడింది. పౌలు కొరింథులోనున్న క్రైస్తవులతో యిలా అన్నాడు, "మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" (1 కొరింథీ. 3:16). క్రైస్తవుల యొక్క కూడికగా సంఘము దేవుని నివాస స్థలముగా రూపొందుతుంది. దేవుని గుడారము నేడు సంఘమనే సజీవమైన శరీరము. ఈ విధంగా వ్యక్తిగతమైన క్రైస్తవులు పరిశుద్ధులని ఎందుకు పిలువబడ్డారో – పవిత్రమైన పనిని జరిగించడానికిని, దేవునికి నివాస యోగ్యమైన మందిరముగా ఉండడానికిని–వారు సువార్తద్వారా ప్రత్యేక పరచబడినవారై యున్నారు (1 కొరింథీ. 1:2).

ఒక్క లేఖన భాగమందు, సంఘాన్ని క్రొత్త నిబంధన "జ్యేష్ఠుల సంఘము" అని సూచించబడింది (హెబ్రీ. 12:23). సంఘంలోని ప్రతి సభ్యుడును "పరలోకమందు వ్రాయబడియున్న" వాడు గనుక భవిష్యత్తుకు సంబంధించి సంఘము ఒక ప్రత్యేకమైన సంబంధాన్ని కలిగియుంది. క్రీస్తు తనకు ప్రసాదించిన నిత్య నిరీక్షణను బట్టి, భవిష్యత్తులో క్రైస్తవుడు భయము, బెదురు లేనివాడై నిలుస్తాడు. బాంధవ్యంతో కూడిన ఈ పేర్లు – సంఘమంటే ఏమి, సంఘం ఎలా జీవించాలనే సంగతులను తెలుపుతోంది. క్రైస్తవులు భూమిమీద ఎలా జీవించాలో, రక్షింపబడినవారు దేవునితో భవిష్యత్తులో ఎలా ఉండబోతారో అవి చెప్పుతాయి.

## ముగింపు

అబ్రాము అనేది అతనికి యిక ఎంత మాత్రము తగినదై యుండదు గనుక అబ్రాము యొక్క పేరును దేవుడు అబ్రాహాముగా మార్చాడు. అనేక జనములకు తాను తండ్రి కాబోతున్నట్టు దేవుడు అబ్రాముకు తెలిపాడు (ఆది. 17:5). అబ్రాము అనే పేరుకు అర్థం "గొప్ప తండ్రి"యని. అబ్రాము అనేది అర్థసహితమైన పేరే, అబ్రాముయొక్క

భవిష్యత్తుకు అది తగినదైయుండదు. అబ్రాహాము అనే పేరుకు “అనేక జనములకు తండ్రి” అని అర్థం. జనములకు తండ్రి కాబోయే వానికి అది తగిన పేరై యుంటుంది. అబ్రాహాము అనే పేరు అతనికి పెట్టినప్పుడు, అందులో దేవునికి కొంత అర్థముంది, మరియు అబ్రాహాముకు కూడా కొంత అర్థముంది. అలాగే, సంఘానికి దేవుడు ప్రసాదించిన పేరులో ఆయనకు కొంత అర్థముంటుంది, మరియు మనకు కూడా అది కొంత అర్థం యివ్వాలి.

క్రొత్త నిబంధన సంఘాన్ని సూచించడానికి తగిన పద్ధతులున్నాయి, వాటిని ఉపయోగించాలి. బైబిలుకు సంబంధంలేని పేర్లను ఉపయోగించి సంఘముయొక్క అభేదాన్ని జనులు తారుమారు చేస్తారు. క్రొత్త నిబంధన సంఘంగా ఒక జనుల గుంపుగా ఉండ ప్రయత్నిస్తూ, క్రొత్త నిబంధన సంఘంగానే తెలియబడగోరినట్లయితే, సంఘానికి క్రొత్త నిబంధనలో యివ్వబడిన పేర్లనే వారు ఉపయోగింపవలసి యుంటారు. క్రొత్త నిబంధన సంఘమని చెప్పుకొంటూ, అది క్రొత్త నిబంధన సంఘమే కాక పోవచ్చు. అయితే అది నిజంగానే క్రొత్త నిబంధన సంఘమైయుంటే, క్రొత్త నిబంధన భాషకు తగినట్టు తన్ను తాను చూపుకోవలసి యుంటుంది.

నేడు దేవుని సంఘంగా ఉండడానికి సమర్పణ కలిగియుంటే, సభ్యులు తమ్మును తాము ఎలా పిలుచుకొంటూ, తమ్మును వర్ణించుకుంటారో అనే దానిలో సహితం అది కనబరచవలసి యుంటుంది. తన సంఘం ఎలా ఉండాలి, ఎలా నడవాలి అని కోరుకునేది, తమ జీవితాల్లోను తమ ఆచరణలోను కనుపరచాలి. అలా ఉండగోరినవాడు దేవుడు సంఘానికి ఏ పేర్లను ఉపయోగించాడో కనీసం అక్కడనుండైనా తమ క్రైస్తవ జీవితాన్ని ఆరంభించేవారై యుండాలి. దేవుడు సంఘాన్ని ఏ విధంగా పిలిచాడో అలాగే క్రైస్తవులు తమ్మును పిలుచుకొనేవారై ఉంటే, వారు సరియైన మార్గంలో ఆరంభించిన వారుగాను, దేవుడు కోరుకొనిన వారుగాను మరియు రూపొందవలసినట్టు ఆయన ఉద్దేశించిన వారుగాను సాగుతారు (అనుబంధము 3, 269వ పేజీలో చూడు).

## పరిశీలనకైన ప్రశ్నలు

*(జవాబులు - 256వ పేజీలో)*

1. సంఘముయొక్క సంబంధములో "రాజ్యము" అనే పదం క్రొత్త నిబంధనలో ఎలా ఉపయోగింపబడింది?
2. సంఘాన్ని పౌలు "క్రీస్తు సంఘమని" ఎందుకు సూచించాడు? సొంతదారుని సూచించడానికి సంఘానికి ఏ యితర పేర్లు వినియోగించబడ్డాయి?
3. క్రొత్త నిబంధనలో యివ్వబడిన పేర్లనే సంఘానికి మనం ఎందుకు యివ్వాలి?
4. బైబిలులో వలె సంఘాన్ని మనం సూచించినప్పుడు ఏమి సాధకమౌతుంది?
5. సంఘము "దేవుని కుటుంబమని" ఎందుకు పిలువబడింది?
6. "క్రైస్తవుడు" అనే పదానికి ప్రాథమిక భావమేమి? ఒకడు క్రైస్తవుడుగా జీవించునప్పుడు, అతడు ఏ విధంగా జీవిస్తాడు?
7. ఫిలిప్పీ. 1:21లో క్రైస్తవుడుగా పౌలు తన జీవితాన్ని ఎలా వర్ణించాడు?
8. "దేవుని బిడ్డ" అనడంలోని భావమేమి? దేవునితో దీనికున్న సంబంధ లక్షణాలేవి?
9. క్రొత్త నిబంధనలో "శిష్యుడు" అనే పదం ఎంత తరచుగా కన్పిస్తుంది?
10. శిష్యునియొక్క గుణగణాలను తెలుపుము.
11. "పరిశుద్ధుడు" అనే పదానికి ప్రాథమిక భావాన్ని తెలుపుము. ఒకడు ఎప్పుడు "పరిశుద్ధుడ"నబడతాడు? పరిశుద్ధుని యొక్క గుణగణాలేవి?

---

[1]క్రొత్త నిబంధనలో సంఘము పలు ఉదాహరణలతో వివరించబడింది: గొర్రెలమంద (మత్తయి 10:1), ద్రాక్షాతోట (మత్తయి 20:1), లేక విలువైన ముత్యము (మత్తయి 13:45, 46). ఈ రూపచిత్రాలు సంఘమును బాగా అర్థము చేసికొనుటకు సహాయపడతాయి. అవి ఉదాహరణలు మాత్రమేగాని సంఘమును గుర్తింపు చేయునవి కావు. [2]ఇక్కడ ఉపయోగించిన "పేర్లు" బైబిలు రూపములో సంఘమును సూచిస్తాయి.